
# రస దృష్టి



**క్లాస్‌మేట్ భారతి** వచ్చి వెళ్ళాక సరళ మనసంతా వికలమయిపోయింది. పెళ్ళి కుదిరిందని విని వచ్చి కంగ్రాట్యులేట్ చేయడానికి వచ్చిందేమో అనుకొంది సరళ మొదట్లో. వస్తూనే శుభాకాంక్షలు చెప్పినా, 'అదేమిటే, బొత్తిగా డాక్టరును చేసుకోడానికి ఎందుకు ఒప్పుకున్నావు?' అనేసింది భారతి కాస్సేపటికి. అందరూ తనను చూసి అసూయపడుతున్నారనుకుంటే ఇదేమిట్రా ఇలా అంటుంది అనుకొన్నా, 'నన్నడిగే మా వాళ్ళు ఖరారు చేసారుగా' అని చెప్పింది సరళ నవ్వు చెదరకుండా.

“అదే నా బాధానూ, అన్నీ ఎంతో కూలంకషంగా ఆలోచించే దానివి, నువ్వే ఇలా చేసావేమిట్రాని ఆశ్చర్యం కూడా వేసింది.” అంది భారతి అదే ధోరణిలో.

“ఓహ్, అదా మనం కాలేజీలో ఉండగా ఏవేవో కబుర్లు చెప్పుకునేవాళ్ళం, డాక్టర్లు, నర్సులు గురించి జోకులేసుకునేవాళ్ళం. తర్వాత అనిపించింది. చెడిపోయే బుద్ధుంటే ఏ వృత్తిలో ఉన్నా చెడిపోవచ్చుని. అందుకే....”

“అబ్బ, అదికాదే, దాని గురించి నేనూ వర్రీ కాను. అలా అయితే నేను ప్రకాష్‌ను చేసుకోవడానికి ఎందుకొప్పుకుంటాను చెప్పు. నీకు తెలుసుగా, ప్రకాష్ కమ్మర్షియల్ ఫోటోగ్రాఫర్, చాలామంది మోడల్స్ అతని దగ్గరకి వస్తారు కూడా. అయినా అతని మీద నమ్మకంతోనే పెళ్ళికి ఒప్పుకున్నాను కదా. అన్నట్లు, సమ్మర్‌లో ముహూర్తాలున్నాయిట. మే 20న పెళ్ళి నిశ్చయం కావచ్చు” అంది భారతి.

"మరి చెప్పవేం, కంగ్రాట్స్, ఇంతకీ ఏమిటే నీ గోల. సరిగ్గా చెప్పు. ఇక్కడెవరూ లేరుగా."

"ఏదో సైకాలజిస్టులా చెబుతున్నాననుకోకు. ఆలోచించి చూడు. మన శరీరంలోని భాగాలు ఒక ప్రయోజనం కోసం ఏర్పడ్డాయి. వాటిని చూస్తే మనకేమీ పులకింత కలగదు. కానీ వాటిని మనం మరుగుపరచడం వలన, వాటి గురించి ఇతరులు కవిత్వాలు అల్లడం వల్లన, ఆపోజిట్ సెక్స్ వాళ్ళకి అవి అకర్షణీయంగా అనిపిస్తాయి. ఇతర దేశాలు వదిలేయి. మనదేశంలోని మగాళ్ళకి ఆడవాళ్ళు ఇంటిమేట్ పార్ట్స్ అంతగా కంటబడవు కనక, వాటి గురించి ఊహించుకొని కలలు కంటారు. దాని వల్లనే రొమాంటిక్‌గా ఫీలయి, మనని రొమాంటిక్‌గా తయారు చేస్తారు. మనం ఒళ్ళు ఊపినా, ఊపకపోయినా, ముంగురులు విదిల్చినా, విదల్చకపోయినా వాళ్ళకి మధురంగా అనిపించి ఎక్సైట్ అవుతారు. నిజమేనా?"

"నిజమే. మన కవిత్వం, సాహిత్యం అంతా వీటి గురించేగా...."

"అవునా, మరి డాక్టరు విషయం తీసుకో. ఈ భాగాలన్నీ ముందే చూసేసి ఉంటాడు కదా. అటువంటి వాడికి ఎక్సైట్‌మెంట్ ఏముంటుంది? ఏ భాగం చూసినా మత్తెక్కదు, రొమాంటిక్‌గా ఒంగి బుగ్గ మీటినా, 'ఇది మెడుల్లా అబ్లాంగేటా, ఇది ఒరాంగ్ ఉటాంగ్, ఇది గ్రంధి, ఇది తిత్తి....' ఇలా ఏవో పేర్లు గుర్తొస్తాయి వాళ్ళకి. ఓస్ ఇంతేనా అనుకుంటాడు. అదే ప్రకాష్‌లాటి కళాకారుడయితే అక్కడ లేనివాటిని కూడా ఊహించుకొని పులకరించి, మన వెంట బడతాడు. శృంగారం కురిపిస్తాడు. డాక్టరుకు అలాటి ఊహే పోదు. మరి సంసారంలో మజా ఏముంటుందో నాకర్థం కాదు బాబూ...."

భారతి చెప్పినది విన్నాక ఆమె వాదన చాలా సమంజసంగా ఉందనిపించింది సరళకి. ఈ విషయం గురించి ఆలోచించనందుకు తనను తాను చాలా తిట్టుకుంది. ఎవరూ సలహా చెప్పనందుకు వాళ్ళని తిట్టిపోసింది – మనసులోనే. పెళ్ళి కాన్సిల్ చేసేయమని నాన్నగారికి చెప్పడానికి ధైర్యం చాలలేదు. యాంత్రికంగా పెళ్ళికి సిద్ధమవుతూనే శృంగారహీనంగా గడవబోయే తన భావి జీవితం గురించి ఆలోచించి, ఆలోచించి చివరకు నిర్వేద స్థితికి వచ్చేసింది.

అందుకే తొలిరేయి రాజేష్ దరి చేరి, తనను స్పృశించినా ఆమెలో స్పందన కలగలేదు. ఛాతీ నిమురుతూ ఉంటే కొంత వెక్కిరింతగానే అడిగింది – "వీటిల్లో ఉండే జీవకణాల పేరేమిటి? అవి గంటకు ఎన్ని వందల చొప్పున వృద్ధి పొందుతాయి?" అని.

రాజేష్ తెల్లబోయాడు. "అదెందుకు అలా అడుగుతున్నావ్?" అన్నాడు.

దు:ఖం పట్టలేక సరళ భోరుమని ఏడ్చేసింది. ఇన్నాళ్లనుండి మనస్సులో పొంచివున్న నిరాశా, నిస్పృహ కన్నీళ్ళరూపంలో బయటకు ఉరికాయి. రాజేష్ ఖంగారు పడ్డాడు. ఒంట్లో బాగోలేదేమో ననుకుంటూ అలవాటు కొద్దీ మెడకింద చెయ్యిపెట్టి చూసి, పల్స్ చూడబోయేడు.

సరళ అతని చేయి విసిరికొట్టింది. "అందుకే డాక్టర్ని చేసుకోద్దన్నారు. ఎప్పుడు చూసినా రోగం గురించే ధ్యాస. ఆడదాని ఒంట్లో ఏమున్నాయో అన్నీ ముందే చూసేసారు. ఇక కొత్తగా చూడాలన్న సరదా ఏముంటుంది?" అంటూ విరుచుకుపడింది.

రాజేష్‌కి అర్థమయ్యింది. అతని ఫ్రెండ్స్ కూడా డాక్టర్ల కుండే 'ఛాన్స్'ల గురించి జోక్స్ వేస్తూనే ఉంటారు కాబట్టి, కొత్త పెళ్ళికూతురి వ్యథ బోధపడింది. దూరంగా తొలిగిపోతున్న సరళను దగ్గరకు లాక్కుని, కౌగిలిలో బిగించి చెప్పాడు – "చూడు పిచ్చిపిల్లా, డాక్టరనగానే ఇవన్నీ చూడడం ఒకటే పని కాదు. దిగంబర శరీరాలు చూడాలంటే అనేక పత్రికల్లోనూ, సినిమాలలోనూ వస్తూనే ఉన్నాయి. అందరూ చూస్తూనే ఉన్నారు. డాక్టర్ల విషయానికొస్తే వాళ్ళు బొమ్మలు కాకుండా నిజమైన మనుష్యులనే చూస్తారు. నిజమే, కాని ఎప్పుడు? దానికేదో జబ్బొచ్చి, కృంగి, కృశించి, లేదా వాచి, ఇన్‌ఫెక్షన్ వచ్చి, రసి కారుతూ – ఇలాటి సమయాల్లో చూడాల్సి వస్తుంది. ఆరోగ్యంగా ఉన్నప్పుడు డాక్టరు దగ్గరకి ఎందుకు వస్తారు? అలాటి ప్రైవేట్ పార్ట్స్ ఎందుకు చూపిస్తారు?

"అవన్నీ చూసి, చూసి ఉన్న డాక్టర్‌కు ఆరోగ్యంగా ఉన్న దేహాన్ని చూసినప్పుడు మామూలు

వాళ్ళకంటే ఎక్కువగా ముచ్చటగా ఉంటుంది. అందుకనే తక్కినవాళ్లతో పోలిస్తే భార్య దగ్గిర ఎక్కువ ఆనందం పొందేది డాక్టరే! అందునా నీలాగ అందంగా కూడా ఉంటే మరీనూ.., నీకోటి చెప్పనా, నీ చర్మం చాలా మృదువుగా ఉంది. పట్టులా, శాటిన్ కర్టెన్‌లా, పట్టుకుంటే జారిపోయేట్లా ఉంది. సాధరణంగా పేషెంట్స్ చర్మాన్ని చూసి, చూసి విసిగిపోయి. పల్స్ చూడాలంటే వాళ్ళను ముట్టుకోవాల్సి వస్తుంది కదాని బాధపడే నా ప్రాణానికి నిన్ను తాకితేనే ఎంతో హాయిగా ఉంది."

అతను చెప్పినదంతా శ్రద్ధగా విన్న సరళ "నా స్కిన్ నిజంగా అంత బాగుంటుందా, లేదా కోస్తున్నారా?" అంది బుంగమూతి పెట్టి.

"నా మాటల్లో సిన్సియారిటీ గ్రహించాలంటే నా కళ్ళలో కళ్ళు పెట్టి చూడాలి." అన్నాడు. రాజేష్. ఆమె అలా చూస్తుండగానే ఆమె పెదాలు అందుకుని, ముద్దాడుతూనే ఆమె మెల్లగా దిండు మీదకు జార్చేడు.

కాస్సేపటికి ఇద్దరూ అలిసిపోయేరు. సేదదీరే సమయంలో ఆమె ముంగురులు వేలితో చుదుతూ, రాజేష్ మళ్ళీ మెదలెట్టాడు, "అందరూ డాక్టర్ల గురించి ఇలా అనుకుంటారు కానీ, ఆర్టిస్టుల గురించి భయపడాలి. వాళ్ళ దగ్గరికి వచ్చేవాళ్ళంతా ఆరోగ్యంగా, అందంగా ఉండేవాళ్ళే. నవ్వుతూ, తుళ్లుతూ ఉంటారు. సన్నంగా, పొందిగ్గా, అవయవాలన్ని చక్కగా అమరినట్లుగా ఉంటారు. బెరుకులేకుండా గంటల తరబడి వాళ్ళ అందాలన్నీ ఆరబోస్తారు. రోజంతా అలా గడిపి వచ్చినవాడికి ఇంట్లో భార్యను చూస్తే పెద్దగా నచ్చదేమోనని నా అభిప్రాయం. రాజును చూసిన కళ్ళతో మొగుణ్ని చూసినట్లుంటుంది. మా చెల్లెలికి అలాటి సంబంధం వస్తే నేను వద్దన్నాను. అఫ్‌కోర్స్, ఇంత ఇదిగా వివరించలేదనుకో, కానీ..."

సరళ ఆలోచనలో పడిపోయింది. రాజేష్ చెప్పింది కరక్టే. తన అదృష్టం బాగుండి డాక్టర్ దొరికాడు.... అవునూ, ప్రకాష్ ఫోటోగ్రాఫరేగా.. అందునా కమ్మర్షియల్ ఫోటోగ్రాఫర్... అనుకుంటూ "పాపం... భారతి!" అని పైకి అనేసింది.

"భారతి ఎవరు?" అన్నాడు రాజేష్ కుతూహలంగా, తను చెప్తున్నది ఆపేసి.

సరళ తేరుకుంది. "భారతి ఎవరైతే మీకెందుకు? మీ రతి సంగతి మీరు చూడండి మహానుభావా" అంటూ అతన్ని పైకి లాక్కుని ఛాతీకి అదుముకుంది గట్టిగా, రాజేష్‌కి ఊపిరి సలపనంతగా.

●

(ఆంధ్రప్రభ వీక్లీ ఆగస్టు 1998)